# అజబాధ

ఏ కులమయితే నేం? ఏ మతమయితేనేం?

కులమత తత్త్వాలు మానవుల్లోని దైత్యాంశకు ప్రతీకలు 'కులం కాదు సోదరీ! దాహం తీర్చడానికి కొంచెం నీళ్ళు కావాలని అడుగుతున్నాను' బౌద్ధ భిక్షువు 'ఛండాలిక'తో అన్న మాటలు ఎంతో అర్థవంతమయినవి.

కొంతకాలం మునుపు 'కులం' అనే అంశం అప్లికేషన్ ఫారాల్లో అక్కర్లేదని ప్రభుత్వం నిశ్చయించింది. అందుకే ఆఫీసుల్లో విద్యాలయాల్లో కులం గురించి అడగడం లేదు. అయినా కూడ ఈ కాలంలో 'కులం' అనే పాము పడగ విప్పి నాట్యం చేస్తోంది.

రిజర్వేషన్ కోసం ప్రతి ఒక్కరి కులం గురించి విచారణ చేయడం, తరవాత పరిగణించడమే ఇప్పుడు జరుగుతోంది. కులం పేరుతో విద్యార్థులు అనేక వర్గాలుగా చీలిపోతున్నారు. శ్రామిక వర్గాల, రాజకీయ పక్షాల కథ కూడ అంతే. ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో జాతి లేక కులం పేరుతో కొన్ని పార్టీలు పుట్టి పెరుగుతున్నాయి.

ఏ అస్పృశ్యతను మహాత్మాగాంధీ నిర్మూలించడానికి ప్రయత్నం చేశాడో అదే అస్పృశ్యతను ఇప్పుడు వేదిక మీదకు తెచ్చి స్వలాభార్జన చేస్తున్నారు.

''మతం ఏమయినా మనిషి బాగుపడాలి'' అన్న విశిష్టభావన మట్టిలో కూరుకుపోయినట్టుంది.

నీ కులం పార్టీ అధికారంలో ఉన్నపుడు ఏమేం చేశారు? అందుకే నాకులం పార్టీ అధికారంలోకి వస్తే దానికంటే ఎక్కువగానే చేస్తాం. దాన్ని గురించి ప్రశ్నించడానికి నీకు హక్కు లేదు.

కులతత్త్వం ఒక మూలతత్త్వంగా వికాసం పొందుతోంది. ఈ దేశంలో చేయవలసిన మంచి పనులు చాలానే ఉన్నాయి. మంచినీళ్ళు దొరకని ప్రదేశాలు చాలా ఉన్నాయి. నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉంది. చాలా సులువుగా పరిష్కరించగలిగిన నిరక్షరాస్యత విషయంలో కూడా మనదేశం కూర్మవేగంతో ముందుకు పోతోంది. ఎక్కువమంది పని ఇప్పించండి అనడానికి బదులు నావాళ్ళకు ఇప్పించండి అని కోరడం దీర్ఘదర్శిత్వం అని చెప్పడానికి వీల్లేదు.

'సర్వేజనాః సుఖినోభవంతు' అనే సచ్చింతన అందరూ మర్చిపోతున్నారు. అందరు బాగుపడాలి. అందరు వర్ధిల్లాలి అనే అభిప్రాయం అందరికీ ఉంటే అది అందరికీ మంచిది కాదా?

ఈ వాదోప వాదాలేవీ ఈ కథకు మూలం కావు. ఈ కథలో ఉందేది ఒకే ఒక కుటుంబం. ఆ గృహనాథుడి లేక వారి వామభాగం కులం గురించి మేము అడగడం లేదు. కులం గురించి సంబంధం లేకుండ ఆ కుటుంబంలో ఏమయింది? కుటుంబానికి ఏమి జరిగింది? లేకపోతే ఏం జరిగలేదు? అని వివరించడమే ఈ కథ.

పాత రోజుల్లో ఆ కాళిదాసు 'కుమారసంభవం' అన్న కావ్యం రచించకపోతే ఈ కథకు ఆపేరే పెట్టడమే సమంజసం.

ఆ కుటుంబ నాధుడి పేరు కుటుంబరావు కాదు. ఒకేమాట, ఒకే బాణం, ఒకే భార్య అన్న ఏ పురుషోత్తముణ్ణి స్తుతిస్తున్నామో ఆ రఘుకుల తిలకుని నామధేయమే మన కథానాయకుడి పేరు... రాముడు. వారి ధర్మ పత్ని పేరు సీత అని కాదు. లక్ష్మణుడు అపార్థం చేసుకున్నా, కాదని పోట్లాడినా మేమేం చెయ్యలేం... ఆమె పేరు ఊర్మిళ. అయితే మన రాముడు కావాలని ఆ పేరున్న అమ్మాయిని పెళ్ళి చేసుకోలేదు. 'వివాహాలు స్వర్గంలో నిర్మించబడతాయి' అని ఇంగ్లీషులో చెప్తారు కదా! అయితే అదే ఇంగ్లీషులో 'కాని ఈ భూమిలో పిల్లలు నిర్మింపబడతారు' అని ఒక సూచన ఇచ్చి ఉంటే అది కుటుంబ సంక్షేమ పథకానికి ఉపయోగపడేది.

రాముడు శ్యామవర్ణుడు అని చెబితే అతనిది పాత టెలిఫోన్ రంగు అనికాదు. అతన్ని చాలామంది కోడి రాముడు అని గాని కుక్కుట రాముడు అనిగాని పిలిచేది అతనికి దేవేంద్రునికున్న చెడ్డ ప్రవృత్తి ఉందనికాదు. మొత్తంగా చూస్తే అతని ముఖం నీటిలో పడి బైటికి వచ్చిన ఒక కోడి ముఖంలా ఉంటుంది. అతని జుట్టు ఎలా దువ్వినా పలచగా ఉండడంవల్ల తడిసిన కోడిజూలు మాదిరి ఉంటుంది. ఒకరకమైన వృత్తాకారంలో ఉంటాయి అతని రెండు కాళ్ళు. సాధారణంగా అతనివి గుడ్లగూబ కళ్ళని అందరూ అనుకుంటారు. నాసికకు రెండు లక్షణాలున్నాయి. అసాధారంగా పొడవుగా ఉండడం ఒకటి, నాసికాగ్రం సూది మొనలా ఉండడం రెండోది. పెదవులు మరీ చిన్నవి. పెదవులు కింద ఉండవలసిన గడ్డాన్ని కోసిపారేసినట్టు ఉంటుంది. ఈ లక్షణాలన్నింటిని సంఘటితం చేసి చూసినప్పుడు ఎవరికయినా ఆయన ముఖం కోడి ముఖంలా అనిపిస్తే దానిలో తప్పులేదు. కానీ అతనికి కోడిరాముడు అని పేరు రావడానికి అసలు కారణం అదికాదు. దానికి అసలు హేతువు అతని నవ్వు. గుడ్డు పెట్టిం తర్వాత కోడి అరుపు ఎలా ఉంటుందో అతని నవ్వుకూడా అలాగే ఉంటుంది. అతను నవ్వగానే చుట్టుపక్కల వారికి కూడ నవ్వు వస్తుంది. వాళ్ళు నవ్వడం చూచి అతనింకా ఎక్కువ నవ్వుతాడు. అతను ఎక్కువగా నవ్వేటప్పుడు చుట్టూ ఉన్నవారికి నవ్వుకు కూడా కంట్రోలు లేకుండా పోతుంది.

అతను ఎలా నవ్వినా, నవ్వించినా చదువులో మాత్రం అతను చాలా సమర్థుడు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పాసై ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగం కూడ సంపాదించాడు.

ఉద్యోగ గ్రహణానంతరం రెండు సంవత్సరాలు దాటకుండానే పాణిగ్రహణం సాధించాడు. అమ్మాయి పేరు ఊర్మిళ అయినా కొంతమంది ఆమెను గజలక్ష్మి అని గాని గజేంద్రమోహిని అనిగాని పిలవడం మరీ అపభ్రంశం కాదు. అయిదడుగుల రెండంగుళాల ఎత్తు. దాంతోబాటు తొంభయి కిలోల బరువు ఉండడం గజ అనే బిరుదుకు ఆమె అర్హురాలు అని అందరికీ అర్థం అవుతుంది. అయితే లక్ష్మి అని ఆమెను పిలవడంలో తప్పేం లేదు. ఆమె సంపన్నకుటుంబం నుంచే వచ్చింది. ఆ కులంలో ఇంజనీరింగ్ పాసయిన వరులు దొరకడం చాలా కష్టం అందువల్ల ఆ కుటుంబం నుంచి కోడి రాముడుకు సంబంధం రావడం రెండు కుటుంబాలకూ లాభదాయకమయింది. రాముడుకున్న కుక్కుట రూపం ఈ వివాహానికి అడ్డం కాలేదు. ఎందుకంటే కింగ్‌కాంగ్ చెల్లాయి మాదిరి ఉన్న ఆ తరుణీమణికి అప్పటికే రెండు మూడు సంబంధాలు ఛిద్రమైపోయిన విశేషస్థితి దృష్ట్యా ఆమె దృష్టికి అతను అతిలోక సుందరుడుగా కనిపించాడు. మొత్తంమీద ఆమెకు కూడ గజ సౌందర్యం ఉంది. ఆమెది ఒకరకం చామనచాయ - అలలుగా ఉన్న కుంతలాలు, చూడగానే నచ్చే ముఖ కవళిక. ఉత్కృష్టోత్కృష్టమైన వక్షోజాలు, అతి మధురస్వరం, బిడియపడే స్వభావం... ఇంత చాలదా? ఒక అమ్మాయి నచ్చడానికి? ఇంకా లక్ష్మీ కటాక్షం గురించి అయితే చెప్పనే అవసరం లేదు. ఆమె తల్లిదండ్రులు కట్న కానుకలు పుష్టిగానే ఇచ్చారు. అంతేకాక అమ్మాయి సౌకర్యార్థం ఒక కొత్త 'ఎంబాసిడర్' కారును కూడ ఆ తండ్రి కొనిచ్చాడు. వాళ్ళ హనీమూన్ బాగానే జరిగింది. గజలక్ష్మికి కుక్కుటం శక్తి సామర్థ్యాలు, ప్రవర్తన, అలవాట్లు అన్నీ బాగా నచ్చాయి. 'కోడి'కయితే గజమంటేనే ఒక 'కిక్కు'గా ఉండేది.

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డులో పనిచేయడం వల్ల రాష్ట్రంలో అనేక ప్రదేశాలు తిరగవలసి వచ్చింది. ప్రమోషన్ తొందరగా రావడం వల్ల అతను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పదవిని కూడ పొందగలిగాడు. కానీ వివాహం జరిగి పధ్నాలుగు సంవత్సరాలయినా ఆ దంపతులకు తల్లిదండ్రులుగా ప్రమోషన్ రాలేదు. వైద్య పరీక్షలు చాలా చేసుకుని చూశారు. ఇద్దరికీ ఎలాంటి లోపం లేదు. కానీ గజానికి లావు తగ్గించుకోవాలని మాత్రం డాక్టర్లంతా సలహా ఇచ్చారు. చాలాసార్లు ఆమె కష్టపడి స్వయం లఘూకరణ చేసుకుంది గాని, మళ్ళీ ఆమె త్వరగానే తన భారీ శరీరాన్ని తిరిగి పొందటం జరిగింది. దానికి రెండు కారణాలున్నాయి. ఒకటి భర్త ప్రేమాతిరేకం, రెండోది ఆమెకు తిండిమీద విరక్తి కలగక పోవడం. చిట్టచివరికి ఆమె శరీరాన్ని తగ్గించడమనే సమస్యనే మరచిపోవడం మంచిదని వారిరువురూ తీర్మానించుకున్నారు.

కానీ సంతతి కావాలి కదా!

వారిరువురు ఎన్నో గుళ్ళను సందర్శించి చాలామంది దేవుళ్ళకు మొక్కుకోవడం జరిగింది. చాలామంది సన్యాసులకు, బాబాలకు పాదాభివందనం కూడ చేసి చూచారు. ఎన్ని చేసినా గజం గర్భాశయానికి ఎలాంటి చలనం కలగలేదు.

శ్రీకాకుళం నుంచి ఒక స్నేహితుడు ఒకరోజు రాముడింటికి వచ్చాడు. ఆ దంపతుల్ని తన ఊరు రమ్మని ఆహ్వానించాడు. అక్కడ అడవిలో ఒక అమ్మవారి గుడి ఉందనీ, ఒక మేకను బలి ఇచ్చి ఆ అమ్మవారికి ప్రీతి కలిగిస్తే ఏ అభీష్టమయినా నెరవేరుతుందనీ ఆయన చెప్పాడు.

తరవాత మూడు రోజులకే రాముడు, ఊర్మిళ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి తెల్లవారుజామున ఆముదాలవలసలో దిగి శ్రీకాకుళం చేరడం కూడ జరిగింది. ఆ మిత్రుడు నల్లగా నిగ నిగ లాడుతున్న ఒక అందమైన మేకపిల్లను కూడ వారు వెళ్ళేటప్పటికి సిద్ధంగా ఉంచాడు - అది కేవలం 6 నెలల వయస్సు ఉన్న ఒక లేతపిల్ల.

అడవిలో ఉన్న ఆ అమ్మవారి దగ్గరకు వెళ్ళాలంటే నడిచిగాని జీప్‌లోగాని వెళ్ళవలసి ఉంటుంది. రాముడు, ఆ శ్రీకాకుళం మిత్రుడు జీప్‌లో ముందు సీట్‌లో కూర్చున్నారు. జీప్ వెనక భాగంలో ఆమిత్రుని భార్య, కొడుకు, పనిపిల్లవాడు గజమూ, అజమూ కూర్చొన్నారు.

గుడిలో పూజా పురస్కారాల అనంతరం మేక బలిని కూడ జరిపించారు. తమ మనోకామనను తెల్పడానికి అమ్మవారి విగ్రహంవైపు భక్తితో వారిరువురు చూచారు. గజానికి అమ్మవారు చిరునవ్వు చిందించినట్లు, తుంటరిగా తనను చూచి ఒక కన్ను కొట్టినట్లుకూడ అనిపించింది. కొంచెం సేపయ్యాక ఆమె భర్తతో ఆ విషయం చెప్పడం కూడ జరిగింది. రాముడికయితే బైటకి వచ్చిన అమ్మవారి నాలుక నుంచి ఆ లేత మేకపిల్ల రక్తం బొట్లు బొట్లుగా కిందకి పడుతున్నట్లు అనిపించింది. దాని అర్థం అమ్మవారు తామిచ్చిన బలిని స్వీకరించినట్లే అని గదా! చాలా సంతోషంతో వారు హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు.

రెండు నెలల తరవాత పరీక్ష చేసిన డాక్టర్ ఆ దంపతులను అభినందించాడు. ఎట్టకేలకు గజం గర్భవతి అయింది. వాళ్ళ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. శ్రీకాకుళం అమ్మవారికి హృదయపూర్వకంగా తమ కృతజ్ఞతలు అర్పించడమేకాక కొన్ని కొత్త మొక్కులు కూడ మొక్కుకున్నారు.

తన భార్య గర్భవతి అయ్యాక ఆమె అటు ఇటు తిరగడాన్ని కూడ కుక్కటం అనుమతించేవాడు కాదు. ప్రతినెల లేడీ డాక్టర్ వచ్చి పరీక్ష చేసి ఆదేశించిన మందులు, టానిక్కులు అవీ కొని తెచ్చేవాడు. ఎన్నో పళ్ళు, తీపి పదార్థాలు ఇంకా ఆమెకు తినాలనిపించిన సమస్త వస్తువులను ఆమెకు సంతృప్తికరంగా, సమృద్ధిగా తెచ్చి పెట్టాడు. ఆమె అనుదిన పరిచర్యకోసం ఒక క్వాలిఫైడ్ నర్సును గూడ ఏర్పాటు చేశాడు. అనుదినం ఆరకంగా శుశ్రూష చెయ్యడం వల్ల ఆమెకు ఉదరం నానాటికీ అతివేగంగా పెరిగింది. ఒకరోజు సుప్రభాతాన ఏరకమైన ఒడిదుడుకులు లేకుండా సుఖ ప్రసవం జరిగింది. తొమ్మిది పౌన్ల బరువుతో మేషరాశిలో, మేష లగ్నంలో భరణి

నక్షత్రంలో సంజాతుడయిన కొడుకుని చూచి గజానికి, గజపతికి స్వర్గం లభించినట్లయింది. కొంతకాలం వరకు ఆ యింట్లో పండగే పండగ.

ఆ పిల్లవాడికి స్నానం చేయించడంతో, అందంగా అలంకరించడంతో, పాలివ్వడంతో, పిల్లవాడితో ముద్దు ముద్దుగా మాట్లాడడంతో, ముద్దిచ్చి లాలించడంతో ఊర్మిళ సాయుజ్యాన్ని పొందింది. అహోరాత్రులు ఆ పిల్లవాడి పరిచర్యలో నిమగ్న అయినా కూడ ఆమెకు ఎలాంటి అలసట కలగలేదు. బిడ్డ బాగా నిద్రపోతున్నా కూడ రాత్రుల్లో ఆమె అప్పుడప్పుడూ లేచి చూచుకునేది. కొన్నిసార్లు అర్ధరాత్రి లేచి ఆ బిడ్డ ముఖాన్ని చూస్తూ ఉండిపోయేది. ఎంత మంచి అబ్బాయి? ఎంత బొద్దు బొద్దుగా ఉన్నాడు? శరీరం ఎంత నిగనిగలాడుతోంది? ఆ బుజ్జి వినాయకుణ్ణి చూస్తున్నకొలదీ ఆమెకి అభిమానం పొంగడమేకాక ఒక రకమైన గర్వం కూడ కలిగేది.

ఆ బిడ్డ పుట్టగానే తండ్రి ముక్కు వచ్చిందా లేదా అని ఆమె గమనించింది. అది బాగానే ఉండడంవల్ల ఆమెకు ఆనందం కలిగింది. బిడ్డ కళ్ళుకూడ విశాలంగా ఉన్నట్లు ఆమెకు అనిపించింది. కానీ అవి గుండ్రంగానే ఉన్నాయి. అయితే ఫరవాలేదు. రంగు అయితే చామనచాయనే. బిడ్డగా బంగారంగా చూడాలని గట్టి నిర్ణయం తీసుకోవడం వల్ల, అతనికి బంగారువాయ తేవడానికి కొన్ని ఉపాయాలు చేసి చూద్దామని మనసులో అనుకోవడం మాత్రమే కాకుండ వాటిని సత్వర ప్రయోగానికి పెట్టింది కూడా. బంగారాన్ని తేనెతో సాది బిడ్డనోటికి అందించడం; కస్తూరి పసుపు పూసి స్నానం చేయించడం మొదలైన సౌందర్య సంవర్ధక కార్యక్రమాల నన్నింటిని ఆచరణలో పెట్టింది.

అబ్బాయికి అతని తండ్రిలాగే గడ్డం చాలా తక్కువ. అందుకే అప్పుడప్పుడూ ఆమె ఆభాగాన్ని ఎక్కువగా మసాజ్ చేసి పొడుగు చేయడానికి ప్రయత్నించేది. అతని ఉంగరాల జుట్టును చూచి ఆమెకు చాలా ఆనందం కలిగేది. అబ్బాయి నామకరణ మహోత్సవం నాటి నుంచి బంగారపు మొలతాడు, బంగారపు మురుగులు, బంగారపు కడియాలు, ఉంగరాలు, బంగారపు గొలుసుతో అతన్ని అలంకరించేది. గొలుసు మాత్రం కొంచెం పొడుగ్గా ఉండి, దానిలో ఒక చిన్న పాలపీక తగిలించి ఉండేది. నిద్రపోయేటప్పుడు ఆ పాలపీక అతని నోట్లో ఉంటుంది.

మొదట మొదట ఆ అబ్బాయి ఏడ్చినప్పుడంతా పెద్దవాడయినాక ఆయన హిందీ సినీమా ప్లేబాక్ గాయకుడైన ముఖేష్ గొంతు వస్తుందని ఆ తల్లిదండ్రులు అనుకున్నారు. ఎందుకంటే ఆ అబ్బాయిది ఎక్కువగా అనునాసిక స్వరం. తరవాత తరువాత అతని గొంతు కొంచెం మామూలుగా అయిందనిపించినా కనీసం రోజులో అయిదారు సార్లు అదే అనునాసిక స్వరాలు అతని నుంచి వెలువడేవి. కొంతకాలం తరవాత పిల్లలతో ఆడుకుంటున్నప్పుడు అవసరం లేకుండానే అప్పుడప్పుడు 'మే...' అన్న శబ్దం

చేసేవాడు. రాత్రి నిద్రపోయేటప్పుడు కూడ ఒకటి రెండుసార్లు అదే శబ్దం వినిపించేది.

అలాంటి మేక శబ్దం అతని నుంచి వస్తూ ఉండడం వల్ల కొంతమంది పిల్లలు అతన్ని 'మేక' అని పిలవడం మొదలుపెట్టారు. శేషయ్య అని పేరున్న ఆ అబ్బాయిని ఇంకొంతమంది మేషయ్య అని పిలిచేవాళ్ళు.

అలాంటి పిలుపుల వల్ల ఆ అబ్బాయికి ఎలాంటి బాధ కలిగేది గాదు. కాని ఈ విషయం తెలుసుకొన్నందు వల్ల రాముడికి, ఊర్మిళకు దుఃఖం కలిగింది. అకారణంగా అబ్బాయి ఎందుకు మేకలాగా శబ్దం చేస్తున్నాడు అని ఆలోచించి మేక బలి స్వీకరించి ఈ బిడ్డను ప్రసాదించిన ఆ అమ్మవారి ఇంకొక వరప్రసాదమేనా ఈ శబ్ద విశేషం అని స్వయం సమాధానించుకున్నారు.

కానీ దగ్గరగా చూస్తే ఆ అబ్బాయి శరీరం మొత్తం చిన్న చిన్న నల్లని రోమాలు ఉండడం వల్ల, ముఖంలో చిబుకం చాలా అల్పంగా ఉండడం వల్ల, కళ్ళు గుండ్రంగా ఉండడం వల్ల, తలనిండా గుబురుగా జుట్టు ఉండడం వల్ల, అతని ముఖాకారానికి మేక ముఖం సాదృశ్యత కొంచెమయినా లేదా అని ఆ తల్లికి అనుమానం వచ్చింది. ఆ విషయాన్ని కోడి రాముడితో చర్చించడం కూడ జరిగింది.

''ఫరవాలేదమ్మా! నేను కోడి, నీవు ఏనుగు, కొడుకు మేక... ఏం ఫరవాలేదు. కొడుకుకు తల్లి మధ్యన అజ గజాంతరం ఉందని చెప్పవచ్చుకదా!'' అని మనసులో అనుకుని రాముడు నవ్వాడు కాని భార్యతో అలా అని చెప్పలేదు.

కాలచక్రం తిరిగింది. శేషయ్య బడికి వెళ్తున్నాడు. బడిలో కూడ అప్పుడప్పుడూ అలాంటి అపశబ్దాలు రావడం వల్ల పిల్లలంతా శేషయ్యను చూచి నవ్వేవారు కాని అతనికి మాత్రం ఎలాంటి ఆక్షేపణ ఉండేది కాదు. కానీ కొంతమంది టీచర్లు చాలా సీరియస్‌గా క్లాసు తీసుకొనేటప్పుడు గాని, బ్లాక్ బోర్డుమీద రాసేటప్పుడు గాని శేషయ్య నుంచి వచ్చే ఆ శబ్దం విని జడిసిపోవడం వల్ల ఆ చిన్న అబ్బాయి బెత్తం ప్రయోగాన్ని సహించవలసి వచ్చేది. బెత్తం తో కొడుతున్నప్పుడు ఏడవకుండా ఉండడానికి కాని ఇంటికి వచ్చి తల్లిదండ్రులతో ఆ విషయం చెప్పకుండా ఉండడానికి కాని ఆ అబ్బాయికి అంత నిగ్రహ శక్తి ఉండేదికాదు. అది విని ఊర్మిళ హృదయం పగిలిపోయేది. రాముడు స్కూలుకు వెళ్ళి అబ్బాయి సమస్య గురించి చాలా వివరంగా చెప్పాడు. కాని క్లాసులో ఒక టీచర్ చాలా సీరియస్‌గా పాఠం చెప్పడంలో మునగి ఉన్నపుడు ఎవరయినా ఒక విద్యార్థి మేక అరిచినట్లు శబ్దం చేస్తే అతనికి కోపం రాకుండా ఉంటుందా? అత్యుత్తమ ఉపాధ్యాయుడుగా భారత ప్రభుత్వం అవార్డు పొందిన టీచరయినా అలాంటి సందర్భాలలో దండించకుండా ఉండడు. ఒక అబ్బాయి అమాయకత్వం సొంత తల్లిదండ్రులకు తెలిసినంతగా గురువులకు తెలుస్తుందా? విద్యార్థికి తెలియకుండానే, అంటే మనఃపూర్వకంగా కాకుండ ఆ శబ్దం వచ్చిందని ఏ గురువూ అనుకోడు.

అది అతని తుంటరి తనమనే వాళ్ళు వ్యాఖ్యానిస్తారు. పోనీ అని ఆ అపశబ్దాన్ని సహించినా మిగిలిన పిల్లలు దానివల్ల చేసే గోలవల్ల అలాంటి పరిస్థితిలో ఏ గురువయినా ఆ గురుత్వ హైన్యాన్ని లఘువుగా స్వీకరించడం సాధ్యం కాదు. ఆరకంగా శేషయ్యకు అప్పుడప్పుడు బెత్తం దెబ్బలు తినడం, ఆ నొప్పి తగ్గేవరకు క్లాసులో కూర్చుని ఏడవడం, తరవాత ఇంటికి వచ్చి తల్లితో ఆ విషయం చెప్పేటప్పుడు మళ్ళీ ఏడవడం మామూలు కార్యక్రమ మయిపోయింది. అతని తల్లిదండ్రులకు పిల్లవాణ్ణి చూచి కళ్ళవెంట నీళ్ళు వచ్చేవి. ఎంతో ప్రేమతో అతని వీపు నిమురుతూ మళ్ళీ మళ్ళీ ఓదార్చేవారు.

''బాబూ! ఎలాగయినా ఆ శబ్దం రాకుండ చూచుకో! మేక మాదిరి ఎందుకు ఏడుస్తావు? అలాంటి శబ్దం బైటికి రాకూడదు.''

ఏడుస్తూనే శేషయ్య

''అమ్మా! నేను కావాలని అలా చేయడం లేదని ఎన్నిసార్లు చెప్పాను? నాకు తెలియకుండానే అది అప్పుడప్పుడూ వస్తుంది.''

తల్లిదండ్రులకు రోజులు గడుస్తున్న కొద్దీ బాధకూడ పెరిగింది. రాత్రుల్లో శేషయ్య గురించి మేక శబ్దం వస్తున్నా అతని నిద్రకు ఎలాంటి భంగం కలిగేది కాదు. కానీ ఆ అబ్బాయి అటు ఇటు పడుకున్న తల్లి తండ్రులకు మాత్రం ఆ రాత్రి అంతా శివరాత్రే అయ్యేది. అయితే, ప్రతిరాత్రి ఆ అజరోదనం వినిపిస్తుందని అనుకుంటే మాత్రం అది వాస్తవం కాదు.

ఒకరోజు రాముడు శేషయ్యను ఒక సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకొని వెళ్ళాడు. అతను ఒక వంద ప్రశ్నలు అడిగాడు. ఒక ప్రశ్నకింత ఫీజు అని సైకియాట్రిస్ట్ చార్జి చేస్తే బోలెడంత అవుతుందని రాముడు భయపడ్డాడు. ఆ లేత పిల్లవాడు డాక్టరు అడిగిన ప్రశ్నలన్నింటికి యథాశక్తి సమాధానం చెప్పాడు. డాక్టరు పిల్లవాడి నోరు తెరిచి స్వరపేటికలోకి తొంగి చూచి పరిశీలించడమే కాక ఛాతీమద, పొట్టమీద కొట్టి, పిసికి ఏమేమో చేశాడు. అనంతరం శేషయ్యను బోర్లా పడుకోబెట్టి అదే కార్యక్రమాన్ని వీపుమీద కూడ పునరావృత్తం చేశాడు. గాలి దీర్ఘంగా లోపలికి పీల్చమని మెల్లగా వదలమని నిర్దేశించాడు డాక్టరు. అంతటితో ఆగకుండ శేషయ్యను మేక ఏడ్చినట్లు ఒకసారి ఏడ్చి చూపమని ఆదేశించాడు. శేషయ్య అలాగే చేయడానికి ప్రయత్నం చేశాడు. ''మామూలుగా ఈ పిల్లవాడు తెలియకుండా చేసే శబ్దం ఈ రకంగానే ఉంటుందా?'' అని డాక్టరు రాముణ్ణి అడిగాడు.

''నిద్ర పోయేటప్పుడు వచ్చే శబ్దం కరక్టుగా మేక ఏడ్చినట్లే ఉంటుంది. కానీ ఇప్పుడు అబ్బాయి చేసిన శబ్దం ఒక బీద అనుకరణ మాత్రమే...'' అని అతను చెప్పాడు.

తరవాత డాక్టరు శేషయ్యను నాలుగైదుసార్లు అలాగే చేయమని ఆదేశించాడు. అబ్బాయి ఆరకంగానే చేశాడు.

''బాబూ! ఇప్పుడు నాలుగైదు సార్లు నీవు అరిచావు గదా! ఇప్పుడు నీకు ప్రత్యేకమైన ఆనందం ఏమయినా కలిగిందా?'' అని డాక్టరడిగాడు. ''లేదు'' అని మాత్రమే దానికి శేషయ్య బదులు చెప్పాడు. ''లేక ఇంకెలాగయినా నీకు అనిపించిందా?'' అని మళ్ళీ అడిగాడు డాక్టర్. ''లేదు... కానీ నాకు కొంచెం సిగ్గుగా ఉంది'' అని పులిశిన నవ్వుతో చెప్పాడు శేషయ్య.

రాముణ్ణి బైటికి వెళ్ళి కూర్చోమని చెప్పాడు. తరవాత డాక్టర్ ఆ పిల్లవాడితో చాల విషయాలు మాట్లాడాడు. కొన్ని కథలు కూడ చెప్పాడు.

ఒక అడవిలో ఒక చిన్న ఏరు ఉంది. ఒక మేకపిల్ల నీళ్ళు తాగుతోంది. అప్పుడొక పులి వచ్చి నేను తాగే ఏట్లో నువ్వెందుకు తాగావు? నా నీళ్ళు నీవల్ల పాడైపోయాయి కదా అని ఏదో దోషారోపణ చేసి ఆ మేకపిల్లను మింగేసింది.

''అడవిలో వేటకు వెళ్ళే వాళ్ళు ఒక చెట్టుమీద మంచె కట్టి కూర్చుంటారు. ఆ చెట్టుకింద ఒక మేకపిల్ల కట్టి పడేస్తారు. దాని ఏడుపు విని దగ్గరలో ఎక్కడ ఉన్నా పులి వచ్చేస్తుంది. అది దగ్గరకు రాగానే దాన్ని పైనుంచి తుపాకీతో కాల్చి చంపవచ్చు. కానీ రాత్రి వేళప్పుడు మేక ఏడుపు విని పులి చప్పుడు చేయకుండా వచ్చి ఒక్క ఉదుటున మేకపిల్లను ఎత్తుకుని పారిపోతుంది. కానీ ఆ విషయం మేక పిల్లను ఎత్తుకొని పోయాక వేట గాడికి తెలుస్తుంది. మేక మాంసం అంటే పులికెంతో ఇష్టం. అడవిలో మేకలు దొరకటం లేదు కదా! అందుకే జింకల్ని వేటాడుతుంది. కానీ మేక అరుపు విన్నా, దాని వాసన పట్టినా అది పరుగెత్తుకొని వస్తుంది.

చాలా నాటకీయంగా ఇదంతా చెప్పి ఆ డాక్టర్ శేషయ్యలో భయం పెంచడానికి ప్రయత్నించాడు. ఆ పిల్లవాడి ముఖంలో మారుతున్న భావాలు చూచి తాను దాదాపు విజయం పొందినట్లు డాక్టర్ ఫీలయ్యాడు. శేషయ్య భుజాన్ని తడుతూ ''బాబూ! భయపడాల్సిందేమీ లేదు. ఈ ఊర్లో పులి లేదు కదా! ఏమంటావు? మనుషులకు మనుషుల శబ్దమే మంచిది. బాబూ! అందుకే ఈరోజు నుంచి ఆ విసుగు పుట్టించే శబ్దాన్ని మానేస్తావు కదా! అని అడుగుతుంటే చాలా వినయంగా ఆ అబ్బాయి ''అవును! ఇంక నేను ఆ శబ్దం చేయనే చేయను'' అని అన్నాడు.

తాను ఇప్పుడు సాధించగలిగిన అతి ప్రధానమైన ఘనకార్యం వల్ల వచ్చిన కొత్త గర్వంతో డాక్టరు రాముణ్ణి లోపలికి పిలిచాడు.

''ఇంక భయపడడానికేం లేదు. ఇతను చాలా మంచి అబ్బాయి. ఇంక జీవితంలో ఒక్కసారి కూడ అలాంటి శబ్దం చేయడు. ధైర్యంగా వెళ్ళండి. ఒక వారం తరవాత వచ్చి అబ్బాయిలో మార్పు వచ్చిందన్న ఆ సంతోషవార్త తెలపండి.''

రాముడు భలే సంతోషంతో జరిగిన విషయాల గురించి భార్యతో చెప్పాడు. శేషయ్య కూడ కొన్ని వివరణలు ఇచ్చి, ''మేకలాంటి శబ్దం చేయడం ఏం బాగా లేదు. అది మంచి అలవాటు కాదు. అందుకని నేనింక ఆ శబ్దం చేయనే చేయను.''

సంతోషం పట్టలేక ఆ తల్లి పిల్లవాణ్ణి గట్టిగా వాటేసుకుని ఒళ్లంతా ముద్దుల వర్షం కురిపించింది.

కానీ ఆ తల్లిదండ్రుల సంతోషం ఎక్కువసేపు నిలబడ లేదు. ఆరోజు రాత్రే నిద్రపోతున్న ఆ బంగారు కొడుకు నుంచి ఒకే ఒకసారి ఆ శబ్దం వచ్చింది. వాళ్ళు ఉలిక్కిపడి లేచి బాబు ముఖం మీద లైటువేసి చూచారు. అతను చాలా హాయిగా నిద్రపోతున్నాడు. ఏదో సుందర స్వప్నాన్ని చూచి ఉంటాడు. అతని వదనంలో ఒక చిన్న చిరునవ్వు వికసించి ఉంది. శబ్దం పెద్దగా రాలేదు కదా! ఇక పెద్దగా రాదేమో... డాక్టర్ చాలా ధైర్యంగా చెప్పాడు కదా! అయినా అది సడన్ బ్రేక్ పెట్టినట్లు ఆగదేమో... జన్మతః వచ్చిన అలవాటు కదా! మెల్ల మెల్లగా అది పోతుంది... అని 'శుభాప్తి విశ్వాసం' పంచుకుంటున్న ఆ తల్లిదండ్రులు పరస్పరం ఊరడించుకు న్నారు. వాళ్ళకు మళ్ళీ నిద్ర పట్టడానికి తొంభై తొమ్మిది నిమిషాలు పట్టింది.

మరసటి రోజు ఏం కాలేదు. అంటే శేషయ్య నుంచి మేషనాదం బడిలో ఉన్నపుడు బైటికి రాలేదు. ఆరాత్రి నిద్రపోయేటప్పుడు కూడ ఆ శబ్దం రాలేదు. గజ, కుక్కుటాలకు ధైర్యం రెట్టింపయింది. ఆ మరుసటిరోజు కూడ ఏమీ జరగనందున వారికి పూర్తి నమ్మకం కుదిరింది - ఇంక ఎప్పుడూ రాదని కానీ, ఆ తరవాత రోజు బడినుంచి శేషయ్య విషాదభారం ఎక్కువయిన వదనంతో తిరిగి వచ్చాడు. తాను అనుకోకుండ ఆ శబ్దం మళ్ళీ వచ్చిందని టీచర్ రెండు అరిచేతుల్ని ఎర్రగా చేశాడని చెప్పి రెండు చేతుల్నీ తల్లికి చూపించాడు. తల్లి ఆ రెండు చేతులనుంచి నొప్పిని లాగివేస్తున్నట్లు శబ్దం చేస్తూ ముద్దు పెట్టుకుని పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకుంది. ఆమె లోపలినుంచి పొంగివస్తున్న దుఃఖాన్ని ఆ పిల్లవాడు వినగలిగాడు.

''పోనీలే నాన్నా! అంతా బాగవుతుంది'' అని పిల్లవాడి వీపు నిమురుతూ ఓదార్చింది.

ఆ రాత్రి శేషయ్య నిద్రలో మళ్ళీ ఆ శబ్దం చేశాడు. మరుసటి రోజు రాముడు సైక్రియాట్రిస్టు దగ్గరికి పోయి విషయాలన్నీ వివరంగా వినిపించాడు.

''జబ్బు పోయి ఉంటుందని నేననుకున్నాను. బాబుతో విషయాలన్నీ బాగా అర్థమయేటట్లు నేను చెప్పాను. అంటే బాగా బ్రెయిన్ వాష్ చేశాను. ఇంక ఒక చిన్న ఉపాయం ప్రయోగించి చూద్దాం. మేక శబ్దం వింటే దగ్గర ఎక్కడ పులి ఉన్నా అది పరుగెత్తి వచ్చి మీద పడుతుందని భయపెట్టాను కూడ. అందుకని మీరు ఎలాగయినా పులివేషం సంపాదించాలి. బాబు నిద్రపోయేటప్పుడు... తల్లి దగ్గర

ఉండకూడదు... మీరు పెద్దగా గాండ్రించి బాబు మీదికి గెంతాలి. రెండు చేతులతో అతన్ని పైకెత్తి కరవ బోతున్నట్లు చూపించాలి. దీన్ని షాక్ 'ట్రీట్‌మెంట్' అంటారు. ఆ షాక్‌తో మామూలుగా జబ్బు నయం కావాలి.'' అని మానసిక శాస్త్ర కోవిదుడు సలహా ఇచ్చాడు.

''కానీ డాక్టర్! ఆషాక్‌తో బాబు మెదుడికి ఏమయినా...'' అని రాముడు అనుమానాన్ని వ్యక్తం చేయబోయాడు.

''ఛీ! ఛీ! ఇది ఎలక్ట్రిక్ షాక్ ఏమీ కాదు కద! పిల్లలు ఆడుకునేటప్పుడు మామూలుగా జడిపించుకుంటూరు కద! ఇప్పుడు ఒక విస్ఫోటన శబ్దం విని... దీపావళి పటాకాయల ప్రేలుడు శబ్దం వింటే షాక్ రాదా? రోడ్డులో నడుస్తున్నపుడు కారుగాని, మోటార్ సైకిల్ గాని దగ్గరగా వచ్చి నడన్ బ్రేక్ కొట్టినపుడు షాక్ రాదా? కుక్క అరుస్తూ మీది మీదికి వస్తే షాక్ రాదా? మీ డాక్టర్ మీకొక పెద్ద బిల్లు ఇస్తే షాక్ రాదా?'' అని అడిగి పెద్దగా నవ్వాడు. అనుకోకుండ ఆ పెద్ద నవ్వు విని రాముడికి నిజంగానే ఒక చిన్నషాక్ తగిలింది.

''ఒకసారి ట్రై చేసి చూడండి. భయపడడానికేం లేదు. ఏమయినా, ఇది అసలు ఒక జబ్బు కాదు. ఇది కేవలం ఒక సబ్‌కాన్షియస్ అలవాటే. ఒక చిన్న షాక్‌తో అది పోవడానికి అవకాశముంది.''

రాముడు ఆ విషయం గజలక్ష్మితో చర్చించాడు. ఆమెకు ముందు కొంచెం భయం కలిగినా ఈ ఉపాయంలో పెద్ద అపాయం లేదని అనిపించింది.

అదొక శనివారం. రాత్రి భోజనం తరువాత అందరూ పడుకున్నారు. శేషయ్య మంచి నిద్రలో ఉన్నాడని గట్టి పరుచుకుని భార్యను మెల్లగా పడక గదినుంచి బైటికి వెళ్ళమన్నాడు. ఆమెతో అతనుకూడ బైటికి వెళ్ళి ఎక్కడినుంచో సేకరించిన పులివేషాన్ని వేసుకున్నాడు.

ఊర్మిళ పూజ గదికిపోయి కొడుకు మంచిగా కావాలని ప్రార్థించి భర్త దగ్గరకు రాగానే అతను అచ్చంగా పులిలా కనిపించాడు. ఆమెకు ఒక్కసారిగా జడుపు కలిగింది.

''అయ్యో! బాబును ఎక్కువగా భయపెట్టవద్దు. ఇంకా పసివాడే కదా!''

రాముడు బాబు దగ్గరికి వెళ్ళి కొంచెం సేపు అతని ముఖాన్ని చూస్తూ నిలబడ్డాడు. ఆ పడక గదిలో రెండు బల్బులు వెలుగుతుండడం వల్ల శేషయ్య ముఖంలో భావాల్ని స్పష్టంగానే చూడగలిగాడు. అతను ఎంతో శాంతంగా, సుఖంగా, సంతోషంగా నిద్రపోతున్నాడు. అంత మంచి నిద్రనుంచి అతన్ని లేపడమే మహా పాపమని అతనికి అనిపించింది. నిద్రనుంచి ఉలిక్కిపడి లేచి తన భయంకరాకారం చూచి, తన అరుపులు కూడ వింటే ఆ పసివాడి పరిస్థితి ఏమవుతుంది, అతను పెద్దగా ఏడుస్తాడా? భయంతో

పరుపులోనే ఒంటికి పోసుకుంటాడా? అని ఆలోచిస్తున్న రాముడికి తన ధైర్యమే కారిపోతున్నట్లు అనిపించింది. కానీ తన కొడుకు సురక్షిత భావి కోసం ఇది చెయ్యడం తప్పదని అనుకొని చాలా పెద్దగా కాకుండ ఆ గది వరకయినా స్పష్టంగా వినిపించేటట్లు అరిచాడు. శేషయ్య ఒక్కసారి ఉలికి పడ్డాడు. కానీ కళ్ళు తెరవలేదు. మళ్ళీ హాయిగా నిద్రపోతున్నాడు. ఇంక కొంచెం గొంతు పెద్దది చేసి అరిచాడు. శేషయ్య మళ్ళీ ఉలికిపడుతున్నపుడు నాలుగైదు సార్లు అరచి రెండు చేతుల్తో అతన్ని ఎత్తుకొని అతని తలను మింగబోతున్నట్లు అరుపులతోనే దగ్గరకు తెచ్చాడు. ''అమ్మా...'' అని ఒక్క పెట్టున అరిచి స్పృహ తప్పి పాత గుడ్డ మాదిరి రాముడి చేతుల్లో అలా ఉండిపోయాడు. గుండె బాదుకుంటూ పరుగెత్తుకు వచ్చిన ఊర్మిళ బాబును భర్తనుంచి లాక్కుంది. పులివేషాన్ని వెంటనే తీసివేసి ఒక నీళ్ళ సీసాతో వచ్చాడు. ముఖంమీద కొంచెం నీళ్ళు చల్లి బుగ్గలమీద తట్టి లేపడానికి ప్రయత్నం చేసినా అతను కళ్ళు తెరవలేదు.

ఆలస్యం చేయకుండా వెంటనే రాముడు బాబును తీసుకుని డాక్టరు దగ్గరికి పరుగెత్తుకొని వెళ్ళాడు. జరిగిన విషయాన్ని చాలా సంక్షిప్తంగా రొప్పుకుండూ డాక్టరుకు చెప్తున్నపుడు ఆ డాక్టర్ కొంచెం దూదిమీద ఏదో మందు చల్లి శేషయ్య ముక్కు దగ్గర పెట్టాడు. రెండు నిమిషాల్లోపల అతను కళ్ళు తెరిచాడు. దగ్గరే ఉన్న తల్లిని చూచి ఆమె గుండెలో తలపెట్టుకుని శేషయ్య వెక్కి వెక్కి ఏడ్చాడు. పాపం ఆ తల్లికి కూడ ఏడవకుండా ఉండడానికి సాధ్యం కాలేదు.

మృతసంజీవనితో యమపాశపు ఉచ్చులోంచి ఒక ప్రాణిని రక్షించిన గంగా పార్వతీశుని మాదిరి ఫీలయిపోతూ డాక్టరు తన అధిక ప్రసంగం మొదలు పెట్టాడు.

''ఏం మిస్టర్! మీ తలకాయలోపల ఉండేది ఒంట్రు మట్టా? ఒక చిన్న పిల్లవాణ్ణి ఇలా భయపెట్టడం, అదీ బాగా నిద్రలో ఉన్న వాడికి ఈ రకంగా షాక్ ఇవ్వడం చాలా బాగుందయ్యా! షాక్‌తో చచ్చిపోవడానికి కూడ అవకాశముంది. అదృష్టం బాగున్నందువల్ల అబ్బాయికేం కాలేదు. నా ప్రశ్నల కన్నిటికి అతను సరిగ్గానే జవాబిచ్చాడు. షాక్‌లో మెదడుకేమయినా ప్రమాదం జరిగితే ఒక్కొక్కప్పుడు పిల్లవాడు నార్మల్ కాకుండా పోయే అవకాశముంది.''

''డాక్టర్ పిచ్చేశ్వర్రావు ఆదేశం వల్లనే నేనిలా చేశాను'' అని ఏదో మహాపరాధం చేసిన ఒక నిందితుడి మాదిరి తలకిందికి పెట్టి రాముడు అన్నాడు.

అతని పేరు వింటేనే నీకు తెలియలేదా పిచ్చి పిచ్చిగా మాట్లాడతాడని? అతను ఏమయినా చెప్పగలడు? కానీ ప్రమాదం నీ బిడ్డకే కదా! సరే! జరిగిందేదో జరిగింది. కనీసం ఇప్పట్నుంచి ఈ పిచ్చి ఆటలు ఆడవద్దు.''

డాక్టరుకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చేసి అతి వినయంతో తలవంచి నమస్కరించి అంత రాత్రివేళ అతనికి శ్రమ యిచ్చినందుకు క్షమాపణకోరి వాళ్ళందరూ ఇంటికి వచ్చేశారు.

రాముణ్ణి చూచి శేషయ్యకు ఎలాంటి భయం కలగలేదు. ఎందుకంటే పులివేషంలో వచ్చింది ఆయన అని శేషయ్యకు తెలియదు.

ఇంటికి వచ్చి పిల్లవాణ్ణి పడుకోబెట్టాక ఊర్మిళ డ్రాయింగు రూమ్‌కు వచ్చేటప్పటికి రాముడు అక్కడ ఒంటరిగా కూర్చుని కన్నీరు కారుస్తున్నాడు. ఆమె అతనితో ఎన్నెన్నో మాటలు చెప్పి ఓదార్చింది.

తరువాత రోజు ఆదివారం కావడంవల్ల దినమంతా ఆ తల్లిదండ్రులు ఆడుతూ పాడుతూ గడిపారు. అతనికి నచ్చిన వంటకాలెన్నో చేసి తినిపించడమేకాక అతనికి నచ్చిన ఆటలు కూడ ఆడి, ఎన్నో తమాషాలు చేసి అతనిని నవ్వించి, గిలిగింతలు పెట్టి వీలున్నంతవరకు వాత్సల్యం కురిపించి వాళ్ళు తృప్తి పడ్డారు.

ఆ ఆదివారం శేషయ్య మేషయ్య రోదనం చేయలేదు. సోమవారం చెయ్యలేదు. మంగళవారం చెయ్యలేదు. రోజులలా గడుస్తున్న కొద్దీ వాళ్ల సంతోషంకూడ పెరుగుతూ వచ్చింది.

మళ్ళీ ఎప్పుడూ శేషయ్యనుంచి ఆ అనునాసికా స్వరం రాలేదు.

డాక్టర్ పిచ్చేశ్వర్రావు పిచ్చి డాక్టరు కావచ్చు లేదా వట్టి పిచ్చివాడు కావచ్చు. అతని ఉపాయంలో ఎంత అపాయం దాగి ఉన్నా అది ఫలప్రదం అయింది కదా! గజ, కుక్కుటాలకు ఏ రోజయినా ఎవరకయినా, జై కొట్టాలనిపిస్తే అది ''పిచ్చి డాక్టర్ జిందాబాద్'' అనే.

అది కరక్టే.. ఈ ప్రపంచంలో కొంతమంది పిచ్చివాళ్ళు లేకపోతే సమస్త లోకానికి పిచ్చి రావడానికి అవకాశముంది.